## క్లుప్తంగా

### సైబర్ నేరాల ఉచ్చులో పడొద్దు



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

కదిరి అర్బన్: సైబర్ నేరాల బారినపడకుండా అప్రమత్తంగాఉండాలని డీఎస్పీ శ్రీలత హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరప్రసాద్ అధ్యక్షతన సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డీఎస్పీ శ్రీలత, పట్టణ సీఐ నారాయణరెడ్డి సైబర్ నేరాల ఉచ్చులో పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కళాశాల ప్రాంగణం, బస్టాండ్‌లలో ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతుంటే నిర్భయంగా తమకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పర్సనల్ ఫొటోలు, సమాచారం ఎవరికీ షేర్ చేయరాదన్నారు. సెల్‌ఫోన్‌లో ఎవరైనా అసభ్యకర మెసేజ్‌లు పెడుతుంటే తమకు తెలియజేయాలన్నారు. సమావేశంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా జీవనం సాగించండి

అమడగూరు: గ్రామస్తులంతా కలసిమెలసి ప్రశాంతంగా జీవనం సాగించాలని ఎస్‌ఐ వెంకటనారాయణ సూచించారు. సోమవారం రాత్రి ఆయన పూలకుంటపల్లిలో గ్రామస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వీధుల్లో గొడవలకు పాల్పడరాదన్నారు. అక్రమంగా మద్యం, గుట్కా సరఫరా చేయడం నేరమన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళల పట్ల సోదరభావంతో మెలగాలన్నారు. రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తూ కనపడితే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

### పోషణ్.. బృహత్తర కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగేంద్రనాయక్

ఓడీచెరువు : శిశువుల పెరుగుదలకు, వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదం చేసే 'పోషణ్' ఒక బృహత్తర కార్యక్రమమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ నాగేంద్రనాయక్ పేర్కొన్నారు. ఓడీ చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా వర్కర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పోషక విలువలతో కూడిన ఆహారం శిశువుల ఎదుగుదలకు ఉత్ప్రేరకం వంటిదని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సమాచార అధికారి బాబాఫక్రుద్దీన్, డాక్టర్ కమల్ రోహిత్, డాక్టర్ భానుప్రకాశ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫసర్ కుమార్‌స్వామిరెడ్డి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన వైద్యసేవలందించాలి



ఇన్‌చార్జ్ డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కదిరి టౌన్: కదిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కదిరప్ప కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఇన్‌చార్జ్ డాక్టర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రికి రోజూ 500 మంది దాకా రోగులు వైద్యం కోసం వస్తున్నారన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ బారినపడిన వారు ఆస్పత్రికి వస్తున్నారని, వారికి వైద్య పరీక్షలు చేయడానికి అవసరమైన కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కరెంటు పోయినపుడు వైద్య సేవల్లో జాప్యం జరగకుండా జనరేటర్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్, ఉపేంద్ర, తిప్పన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తారకరామాపురంలో గల కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం ఉచితంగా యూనిఫాం పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బోధన, బోధనేతర సిబ్బంది సౌజన్యంతో దాదాపు 40 మంది విద్యార్థులకు యూనిఫాం ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు త్రివేణి, చిట్టెమ్మ, షమీవుల్లా, గోపాల్‌నాయక్, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, ఆనంద్, సరస్వతి, సుభాషిణి, వెంకటలక్ష్మి, అలీ, మీనా, రాజేంద్రనాయక్, ధనుంజయ, గంగా తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా నిర్వహించండి

- గణేశ్ ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి
- మంటపాల వద్ద నిబంధనలు పక్కాగా పాటించాలి



పుట్టపర్తిలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులకు నిబంధనల కరపత్రాలను అందజేస్తున్న సీఐ సునీత

పుట్టపర్తి టౌన్: గణేశ్ ఉత్సవాలకు వేళయ్యింది. ఈ నెల ఏడో తేదీన వినాయక చవితి. వీధి వీధినా బొజ్జ గణపయ్యలు కొలువుదీరనున్నారు. ఇప్పటికే ఉత్సవ కమిటీలు వినాయక మంటపాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ఎక్కడా అవాంఛనీయ ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని పుట్టపర్తి అర్బన్ సీఐ సునీత ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి ఉత్సవాలపై దిశానిర్దేశం చేశారు.

గణేష్ ఉత్సవాల నిర్వహణకు అనుమతులు సులభతరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సింగిల్‌విండో విధానంతో పోర్టల్ రూపొందించిందన్నారు. ఈ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 79950 95800 నంబర్‌కు వాట్సాప్ ద్వారా 'హాయ్' అని మెసేజ్ పంపితే చాలు ఎన్‌ఓసీ పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మీ వాట్సాప్‌కు వస్తుందన్నారు. ఉత్సవాల అనుమతులకు మీ సేవ ద్వారా చలానా రుసుం చెల్లించి ఎన్‌ఓసీ పత్రం క్యూఆర్ కోడ్ పొందవచ్చన్నారు. అనుమతులు పొంది క్యూఆర్ కోడ్‌ను ఉత్సవాలు నిర్వహించే పందిరిలో తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలన్నారు.

### అనుమతి తప్పనిసరి



ఎస్‌ఐ శ్రీధర్

ఎన్‌పీకుంట: మండల పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ శ్రీధర్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సింగిల్‌విండో విధానంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు సులభతరం చేసిందని తెలిపారు. ప్రజలందరూ కలసిమెలసి ప్రశాంత వాతావరణంలో వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు.

### నిబంధనలు పాటించండి



సీఐ ప్రభాకర్

బత్తలపల్లి: వినాయక విగ్రహాలు కొలువుదీర్చే ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్‌ఐ పి.శ్రీనివాసులు సూచించారు. నిమజ్జన సమయంలో డ్యాన్సులు వేయిస్తే సహించేది లేదన్నారు. విగ్రహాల వద్ద అనుమానిత వస్తువులు, కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విగ్రహాలన్నీ ఒకేసారి ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేయాలని సూచించారు.

### ఇవీ నిబంధనలు

- గణేష్ మండపం వద్ద నిర్వాహకులు నిబంధనలు తప్పకుండా పాటించాలి.
- వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రాంతాల్లో మంటపాలు వద్దు.
- విద్యుత్‌శాఖ అనుమతితో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేసుకోవాలి.
- మండపాల వద్ద టపాసులు, అగ్నికి ఆహుతయ్యే వస్తువులు ఉంచరాదు. ఇసుక బస్తాలు, నీటి బకెట్లు ఉంచాలి.
- మసీదుల వద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే వారు నమాజు సమయంలో సౌండ్ తక్కువగా ఉంచాలి.
- రాత్రి 10 గంటల వరకే స్పీకర్లు ఉపయోగించాలి. 11 గంటలకల్లా విగ్రహాల వద్ద కార్యక్రమాలు పూర్తి చేయాలి.
- అత్యవసర పరిస్థితిల్లో డయల్ 100, 112కు కాల్ చేయాలి.
- అనుమానాదస్పద వ్యక్తులు, వాహనాలు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- విగ్రహాల వద్ద గానీ, నిమజ్జనాల రోజున గానీ అశ్లీల నృత్యాలు ప్రదర్శించరాదు.
- మండపాల వద్ద పేకాట ఆడకుండా, మత్తు పదార్థాలు సేవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- విగ్రహాల రక్షణకు పగలూ, రాత్రి ఉత్సవ కమిటీలే భద్రత కల్పించుకోవాలి.
- ఉత్సవాల నిర్వహణ పేరిట బలవంతపు వసూళ్ల(చందాల)కు పాల్పడరాదు.
- సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దు.. వాటిని ఇతరులకు ఫార్వార్డ్ చేయవద్దు.
- రాజకీయ పార్టీల గుర్తులు ధరించిన కమిటీలపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.

## ఎయిడ్స్ నియంత్రణకు పాటుపడాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ తిప్పేస్వామి

ధర్మవరం అర్బన్: ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం శక్తి మైత్రి మహిళా సంఘం ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' పేరిట ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూడకూడదన్నారు. ఎయిడ్స్ మహమ్మారిని పారదోలడానికి యువత ముందుకు రావాలన్నారు. ప్రతి విద్యార్థీ వారి గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి ఎయిడ్స్ నిర్మూలనకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది హరిబాబు, మల్లికార్జున, బాలజోషి, ఐసీటీసీ కౌన్సెలర్ అరవింద్ కుమార్, ఎయిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్‌కుమార్, వీహెచ్‌ఎస్‌లు కిరణ్మయి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మలుపులు తొలగించండి



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బత్తలపల్లి: జాతీయరహదారిలోని అడ్డదిడ్డ మలుపులను తొలగించాలని సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్నగిరి కాటమయ్య, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కమతం కాటమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పుట్టపర్తిలోని డీఆర్‌ఓ కొండయ్యను రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చలపతి, నల్లమాడ చంద్ర, ఆకులేటి చిన్న యల్లప్ప, గోపాల్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ జాతీయ రహదారి పనులు పూర్తి కావస్తున్నాయని, అయితే బైపాస్ రోడ్డుకు, బత్తలపల్లిలోకి వచ్చే రోడ్డుకు పొంతన లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారని తెలిపారు. రోడ్డు ప్రారంభం కాకనే ఇప్పటికే రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. గంటాపురం, వేల్పుమడుగు గ్రామాలకు వెళ్లే రోడ్ల వద్ద, కదిరి వైపు నుంచి, అనంతపురం వైపు నుంచి బత్తలపల్లిలోకి వచ్చే రోడ్లు ఎస్ ఆకారంలో ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ రోడ్డు మార్కింగ్ మార్పి పనులు చేయాలని కోరారు. లేదంటే భవిష్యత్తులో జరిగే ప్రమాదాలకు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నాలుగు ప్రదేశాలు డేంజర్ జోన్‌గా మారి ప్రజలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని వారు డీఆర్‌ఓను కోరారు.

## పోలా రామాంజనేయులు సేవలు చిరస్మరణీయం



పోలా రామంజనేయులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వామపక్షాల నాయకులు

ధర్మవరం: ప్రజా సమస్యలపై కామ్రేడ్ పోలా రామంజనేయులు చేసిన ఉద్యమ సేవలు చిరస్మరణీయమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు తెలిపారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో మంగళవారం కామ్రేడ్ పోలా రామంజనేయులు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలా రామంజనేయులు చేనేత ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, చేనేత సబ్సిడీల కోసం పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, అధ్యక్షుడు ఆదినారాయణ, కార్యదర్శి అయూబ్‌ఖాన్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు పోతక్క, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు దాము, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బాబు, శీనా, గంగాధర్, చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి, చౌడప్ప, హరి పాల్గొన్నారు.

## 'సత్యసాయి' కార్మికులను ఆదుకోవాలి



బిందెలు నెత్తిన పెట్టుకొని నిరసన తెలుపుతున్న వాటర్ సప్లయ్ కార్మికులు

బత్తలపల్లి: సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం వారు చేపట్టిన సమ్మె 13వ రోజు మంగళవారమూ కొనసాగింది. బత్తలపల్లిలోని సత్యసాయి వాటర్ ట్యాంకు వద్ద మండలంలో పని చేస్తున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు 27 సంవత్సరాలుగా మంచినీటి పథకంలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ తమకు ఎలాంటి గుర్తింపూ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణం స్పందించి తమ నిరసనలను గుర్తించి రావాల్సిన వేతన బకాయిలు, ఈపీఎఫ్, ఈఎస్ఐలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జగన్ మారుతి, నాగేంద్ర, బాషా, షేక్ మహబూబ్‌బాషా, అనంతయ్య, మురుగేష్, రామ్మోహన, జయరాము, సద్గురు, నరసింహులు, కేశవ, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

తాడిమర్రి: రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలించాలని సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు మంగళవారం గొర్రెలకు వినతిపత్రం అందించారు. మద్దులచెర్వు సత్యసాయి తాగునీటి సంప్ వద్ద వారు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారంతో పన్నెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు ఎం.సతీష్, కె.పెద్దఓబిలేసు మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే పిల్లల పోషణ ఎలా సాగుతుందన్నారు. అసలే నిత్యావసరాలు, కూరగాయలు ధరలు మండుతుండటంతో దుకాణాల్లో ఎన్ని రోజులని అప్పులు ఇస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.చిన్న ఓబిలేసు, పి.తిరుపాల్, నాగార్జున, టి.లక్ష్మీనారాయణ తదితర కార్మికులు పాల్గొన్నారు.

### ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని వినతి

పుట్టపర్తి టౌన్: పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని సత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తచెరువులో సత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులు బిందెలు నెత్తిన పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులకు నెలలతరబడి జీతాలు ఇవ్వకపోతే ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. సత్యసాయి వాటర్ ప్రాజెక్టును నిర్వీర్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు.

### విద్యా, క్రీడా సామగ్రి అందజేత



సామగ్రి అందిస్తున్న సత్యసాయి భక్తులు

పుట్టపర్తి: భగవాన్ సత్యసాయిబాబా విదేశీ భక్తులు తమ సేవాభావాన్ని మరోసారి చాటుకున్నారు. బుక్కపట్నం మండలం నార్శింపల్లి ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సింగపూర్‌కు చెందిన భగవాన్ సత్యసాయి భక్తులు చోమ్లీ, శివశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యా, క్రీడా సామగ్రి అందజేశారు. అలాగే ,గ్రామంలో పేదలకు నిత్యావసర సరుకులు కూడా అందజేసి సేవాభావం చాటుకున్నారని పాఠశాల హెచ్ఎం ప్రమీల తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, సుధాకర్, మధుసూదన్‌రెడ్డి, ఓబులపతి, తేజస్విని, అస్మాబేగం, అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీకృష్ణుని ప్రతిమ ఊరేగింపు



ధర్మవరం రూరల్: తుంపర్తిలో మంగళవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ప్రతిమను పల్లకీ ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కార్యక్రమంలో తుంపర్తి కమిటీ అధ్యక్షులు, సభ్యులు అప్పిరెడ్డి శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, యోగానందరెడ్డి, అశోక్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, గోవిందు, రామ్మోహన్‌రెడ్డి, కాంతమ్మ, శ్రీలత, వరలక్ష్మీ, లక్ష్మీ పాల్గొన్నారు.

### అనుమతులు లేని నర్సరీలపై ఫిర్యాదు

నల్లమాడ: అనుమతులు లేని నర్సరీలపై చర్యలు తీసుకోవాలని మండల ఉద్యానవన అధికారి (హెచ్ఓ) నవీన్‌కుమార్ మంగళవారం తహసీల్దార్ రంగనాయకులుకు ఫిర్యాదు చేశారు. మండలంలో ఎనిమిది నర్సరీలు ఉండగా.. ఒక్కదానికి మాత్రమే లైసెన్స్ ఉందని చెప్పారు. లైసెన్స్ తీసుకోవాలని తక్కిన నర్సరీల యజమానులకు పలు దఫాలుగా నోటీసులు అందజేసినా కనీస స్పందన లేదన్నారు. లైసెన్స్ పొందాలని నోటీసులు అందజేయడానికి నర్సరీ వద్దకు వెళ్లిన సిబ్బందిపై ఒకరిద్దరు యజమానులు దురుసుగా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు. విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.



ముదిగుబ్బలో ఖాళీ బిందెలతో మహిళల నిరసన

## తాగునీటి కోసం రోడ్డెక్కి నిరసన

ముదిగుబ్బ : తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు రోడ్డెక్కారు. సీపీఐ ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో ముదిగుబ్బలో రోడ్డుపై బైఠాయించారు. దీంతో అరగంటపాటు వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ 15 రోజులుగా సమ్మె చేస్తున్న సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. మండలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

### వర్షానికి కూలిన ఇల్లు



కనగానపల్లి: మండల కేంద్రంలోని మార్కెట్ సర్కిల్‌లో సోమవారం రాత్రి ఒక ఇల్లు కూలిపోయింది. గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి పైకప్పు దెబ్బతిని నేల కూలిందని బాధితుడు ఈడిక కిష్టయ్య తెలిపారు. భార్య నాగమ్మతో కలసి ఇంటి పక్కనే టీ కొట్టు పెట్టుకోగా.. కుటుంబ సభ్యులంతా కొట్టు వద్ద ఉండగా ఇల్లు కూలిపోయిందన్నారు. ఇంటిలోని ధాన్యం, సామగ్రి దెబ్బతినడంతో రూ.లక్షకుపైగా నష్టవాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

### రూ.30వేల రికవరీకి ఆదేశాలు



సామాజిక తనిఖీ వివరాలు వెల్లడిస్తున్న పీడీ విజయేంద్రప్రసాద్

నల్లచెరువు: ఉపాధి హామీ పథకం కింద 2023–2024 సంవత్సరంలో చేపట్టిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీపై మంగళవారం నల్లచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బహిరంగ ప్రజావేదిక ఏర్పాటు చేశారు. డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని 13 పంచాయతీల్లో క్షేత్రస్థాయి బృందం సభ్యులు ఉపాధి పనులను పరిశీలించారు. సభ్యులు గుర్తించిన అంశాలను బహిరంగ ప్రజా వేదికలో చదివి వినిపించారు. పీడీ మాట్లాడుతూ మండలంలో రూ.7.73 కోట్లతో ఉపాధి హామీ పనులు చేపట్టగా.. కొన్నిచోట్ల పొరపాట్లు జరిగాయన్నారు. రూ.30 వేలపైబడి నిధుల రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీఓ శకుంతల, విజిలెన్స్ అధికారి రాజ్‌కుమార్, ఏపీఓ మంజుల, ఈసీ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.